# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశం జరగనుంది.**

2. **తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **చిన్నారుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి బాలోత్సవాల కార్యక్రమాలు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోనూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ –సర్‌ను చేపట్టాలని నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు కోరారు.**

===========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి –జీఎస్‌డీపీ వృద్ధి రేటు పెంచేందుకు వచ్చే 4 నెలల్లో చేపట్టాల్సిన ప్రణాళికపై చర్చిస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

పూర్వోదయ పథకం ఆంధ్రప్రదేశ్ లోని మూడు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పూర్వోదయపథకం, సాగునీటి ప్రాజెక్టులపై అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి వచ్చేనిధులతో అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నిధులను సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యానపంటల విస్తరణ, గ్రామీణ రహదారులు మౌలిక వసతుల కల్పనకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉత్తరాంధ్రలో 5 వేల కోట్లతో వివిధసాగు నీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

--------------------------

తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 ముగింపు కార్యక్రమంలో "తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్"ను ముఖ్యమంత్రి నిన్న సాయంత్రం ఆవిష్కరించారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం సాధించేలా, అన్ని వర్గాలవారిని సంప్రదించి.. పేదలు, రైతులు, వ్యాపారులు, యువతకు అభివృద్ధి ఫలాలు దక్కేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రిని అగ్రిగోల్డ్ బాధితులు నిన్న కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాధితులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని విధాలా న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా న్యాయం చేస్తామని హోంమంత్రి వెల్లడించారు.

---------------------------

చిన్నారుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి, విద్యా ప్రగతికి, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవ కార్యక్రమాలు దోహదపడుతాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన "అమరావతి బాలోత్సవం" కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన, వక్తృత్వ, నృత్య, నాట్య, డ్రాయింగ్ పోటీలను పరిశీలించారు. ప్రతి జిల్లాలోనూ బాలోత్సవాలు, మాక్ అసెంబ్లీలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కందుల దుర్గేష్ ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

కాలానుగుణంగా వచ్చే వ్యాధులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్‌పై అధ్యయనం చేసేందుకు, జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో కాలానుగుణ వ్యాధులను తగ్గించే చర్యలు చేపట్టాలని చంద్రబాబు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష –'టెట్' ఈ రోజు నుంచి ఈ నెల 21 వరకు రోజూ రెండు విడతల్లో జరుగుతాయి. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 2 లక్షల 71 వేల 692 మంది దరఖాస్తు చేయగా నిన్న సాయంత్రం వరకు 96.25శాతం మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని

టెట్ కన్వీనర్ కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 133 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా జిల్లా విద్యాధికారి –డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోనూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ –సర్ ను చేపట్టాలని నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు కోరారు. పార్లమెంట్ లో సర్ పై చేపట్టిన చర్చలో ఆయన నిన్న మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల సమగ్ర సవరణ – సర్ ద్వారా మరింత పారదర్శకంగా ఓటర్ల జాబితాలు రూపొందుతాయని పేర్కొంటూ..

వాయిస్.. 33 సెకన్లు

---------------------------

కాశీ తమిళ సంఘం కార్యక్రమంలో భాగంగా తమిళనాడు ప్రతినిధుల బృందం ప్రయాగ్‌రాజ్‌ను ఈరోజు సందర్శించనుంది. ఇక నిన్న వారణాసిలోని బంగాలి తోలా ఇంటర్ కళాశాల విద్యార్థులకు పలువురు తమిళం బోధించి విద్యార్థులతో సంభాషించారు. సాయంత్రం నమో ఘాట్ వద్ద సందర్శకుల కోసం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే చిన్నారుల కోసం నేషనల్ బుక్ ట్రస్ట్ అఫ్ ఇండియా –ఎన్‌బిటి ఆధ్వర్యంలో నిర్వహించిన "చలో చలే కహానీ కి దునియా" కార్యక్రమం ద్వారా పిల్లలు కథ చెప్పడం వంటి అభ్యాస ప్రక్రియను నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉభయ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా జిమాడుగులలో 3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవ్వగా తెలంగాణలోని కుమురం భీం ఆసిఫాబాద్‌లోని గిన్నెధరిలో 6.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైయింది. రానున్న రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

=====================